సాక్షి అన్నమయ్య జిల్లా

మంగళవారం, 16, ఏప్రిల్, 2024



వైఎస్సార్‌సీపీలోకి వలసలు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వలసలు జోరందుకున్నాయి. సోమవారం ఆయా ప్రాంతాల నుంచి వేలాది కుటుంబాలు పార్టీలో చేరాయి. - 8లో



మనస్థాపంతోనే సురేఖ ఆత్మహత్య

పరీక్షలు సరిగా రాయలేదన్న మనస్థాపంతోనే ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ విద్యార్థిని సురేఖ (21) ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.160	రూ.230
రెండోరకం	రూ.110	రూ.150



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 178 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	300	430
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 334.240 కిలోలు

న్యూస్‌రీల్

సదా రాష్ట్ర కార్యదర్శిగా సత్యప్రసాద్



మదనపల్లె సిటీ : సీమాంధ్ర డ్రగ్ డీలర్స్ అసోసియేషన్ (సదా) రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా మదనపల్లెకు చెందిన సత్యప్రసాద్ ఎన్నికయ్యారు. తిరుపతిలో ఆదివారం జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆయన ఎన్నికపై మదనపల్లె కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నాయకులు అభినందించారు.

పల్లకీలో ఊరేగిన భద్రకాళీ సమేతుడు



పల్లకీలో ఊరేగుతున్న వీరభద్రస్వామి

రాయచోటి టౌన్ : రాయచోటిలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి పల్లకీలో ఊరేగారు. సోమవారం రాత్రి స్వామివారికి, అమ్మవారికి (మూల విరాట్‌లకు) అభిషేకాలు, పూజలు నిర్వహించి రంగు రంగుల పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించారు. అనంతరం ఉత్సవ మూర్తులకు అభిషేకాలు, పూజలు నిర్వహించి మాఢవీధులలో, ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. ఈ పల్లకీ సేవలు ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డిల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు నిర్వహించారు. ఈ పల్లకీ సేవలో స్థానిక భక్తులతో పాటు కన్నడ భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా ఏజెంట్లుగా పనిచేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కడప డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ రాజేష్ సోమవారం పేర్కొన్నారు. ఏజెంట్‌గా పని చేసేందుకు పదో తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 50 సంవత్సరాలు వయసు కలిగి ఉండాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 28 లోపల దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 29న పోస్టల్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకొని రావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9490032695 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

22 నుంచి టైలరింగ్‌లో శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీ నుంచి టైలరింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్, ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ ప్రతినిధి నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు శిక్షణకు అర్హులన్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువకులకు ప్రాధాన్యతనిస్తామన్నారు. దూర ప్రాంతాల వారికి భోజన, వసతి సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు.ఇతర వివరాలకు 94409 05478, 99856 06866, 94409 33028 నంబర్లలో సంప్రదించాలని ఆయన తెలియజేశారు.

20 నుంచి వైవీయూ డిగ్రీ పరీక్షలు

వైవీయూ : యోగి వేమన యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలల 1, 2,4,6 సెమిస్టర్ల విద్యార్థులకు ఈనెల 20వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్. ఈశ్వర్ రెడ్డి తెలిపారు. మొదటి సెమిస్టర్ (2023- 24), బ్యాచ్, 2వ సెమిస్టర్ (2016-17),(2020-21), (20233-24) బ్యాచ్‌లు, నాలుగవ సెమిస్టర్ (2016-17), (20233-24) బ్యాచ్ ,6వ సెమిస్టర్ (2016-17) విద్యార్థులకు పరీక్షలు ఉంటాయన్నారు. విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వైపి వెంకటసుబ్బయ్య మార్గదర్శకంలో పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. విద్యార్థులు హాల్ టికెట్లను వారు చదువుతున్న కళాశాల నుంచి పొందవచ్చన్నారు. కళాశాల యాజమాన్యాలు ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసేందుకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. మే మాసంలో ఎన్నికల పోలింగ్ తేదీకి అనుకూలంగా ఐదు రోజులపాటు పరీక్షలు ఉండమన్నారు.

సావనీర్ విడుదల

వైవీయూ : కడప నగరంలోని ఎస్కేఆర్ అండ్ ఎస్కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటై 50 సంవత్సరాలు పూర్తవుతున్న నేపథ్యంలో స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా కళాశాల చరిత్రను సావనీర్ రూపంలో తీసుకొచ్చారు. సోమవారం కడప నగరంలోని ఎస్కేఆర్ అండ్ ఎస్కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. వేమల సలీంబాషా సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఒంటిమిట్టకు బ్రహ్మోత్సవ శోభ

- నేటి నుంచి కోదండరాముని బ్రహ్మోత్సవాలు
- ఎక్కడా లేని విధంగా రాత్రి పండు వెన్నెల్లో స్వామి వారి కల్యాణోత్సవం
- అత్యంత అద్భుతంగా రూపుదిద్దుకుంటున్న కల్యాణ వేదిక
- ఈనెల 22న వేలాది మంది కల్యాణాన్ని వీక్షించేలా ఏర్పాట్లు



తుది దశకు చేరుకున్న కల్యాణ వేదిక పనులు

కోదండరాముడి బ్రహ్మోత్సవాల వాహనాల సేవలు..అలంకారాలు

తేదీ	ఉదయం	రాత్రి
16	వ్యాసాభిషేకం	అంకురార్పణ
17	ధ్వజారోహణం	శేషవాహనం
18	వేణుగాన అలంకారం	హంసవాహనం
19	వటపత్రసాయి అలంకారం	సింహవాహనం
20	నవనీతకృష్ణ అలంకారం	హనుమత్సేవ
21	మోహినీ అలంకారం	గరుడసేవ
22	శివధనుర్బాణ అలంకారం	గజవాహనం
23	కాళీయమర్దన అలంకారం	అశ్వవాహనం
24	చక్రస్నానం	ధ్వజారోహణం
25	సాధారణ కార్యక్రమాలు	పుష్పయాగం, ఏకాంతసేవ



కల్యాణ వేదికకు వెళ్లే ప్రవేశ ద్వారం



ఆలయ ఆవరణలో వేసిన చలువ పందిరి

సాక్షి రాయచోటి : ఏకశిలానగరం రాములోరి పండుగకు ముస్తాబైంది. ఒంటిమిట్టలోని శ్రీ కోదండ రాముని బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు తిరుమల-తిరుపతి దేవస్థానం అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ కాక మునుపే ఆలయ పనులను అధికారులు పూర్తి చేశారు. కోదండరాముడి కల్యాణోత్సవాన్ని ఈసారి మరింత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు యంత్రాంగం సన్నద్ధమవుతోంది. అందుకు సంబంధించి బ్రహ్మోత్సవాలకు టీటీడీ అధికారులు జిల్లా అధికారులతో కలిసి అవసరమైన ఏర్పాట్లు చేశారు. అలాగే ఒంటిమిట్ట ఆలయ సమీపంలోని విశాల మైదానంలో ఏప్రిల్ 22న రాత్రి రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా శ్రీ సీతారాముల కల్యాణాన్ని పండు వెన్నెల్లో నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించారు. ఈ కార్యక్రమానికి వీవీఐపీలు, వీఐపీలు, భక్తులు పెద్ద ఎత్తున హాజరు కానున్నారు. దీంతో ఏకశిలా నగరంలో అందుకు అనుగుణంగా పనులను పూర్తి చేస్తున్నారు.

టీటీడీ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు

జిల్లాలోని శ్రీ ఒంటిమిట్ట కోదండరామ స్వామి బ్రహ్మోత్సవ వైభవానికి ముందే ఆలయం చుట్టూ మాఢవీధుల్లో అద్భుతంగా రోడ్ల నిర్మాణాలను పూర్తి చేయడంతో అందంగా కనిపిస్తున్నాయి. ఆలయ సమీపంలో ప్రత్యేకంగా రూపుదిద్దుకున్న పుష్కరిణిని కూడా అందంగా తీర్చిదిద్దారు. ఆలయ దక్షిణ గోపురం ముందు భాగాన పార్కును పూర్తి చేసి పచ్చదనంతో భక్తులు పరవశించిపోయేలా రూపొందించారు. ఆలయ పరిసరాల్లో పూలమొక్కలు...పార్కులో పచ్చదనం.. ఇతర హంగులతో బ్రహ్మోత్సవ శోభ కనిపిస్తోంది. టీటీడీ ఆధ్వర్యంలో సుమారు రూ. 100 కోట్ల వ్యయంతో మూడేళ్లుగా పనులు పూర్తి చేస్తూ వస్తున్నారు. సిమెంటురోడ్లు, పార్కులు, భక్తుల సముదాయం కోసం భవనాలు, పుష్కరిణి, ఇతర అనేక రకాల సౌకర్యాలను నెలకొల్పారు. ఆలయ సమీపంలోనే పార్కుల్లో జర్మన్ టెక్నాలజీతో ఏర్పాటు చేసిన షెడ్లు భక్తులకు చలువ పందిళ్లలాగా చల్లదనాన్ని అందించనున్నాయి.

పున్నమి వెన్నెల్లో కల్యాణం

ఒంటిమిట్టలోని విశాలమైన మైదానంలో శ్రీ సీతారాముల కల్యాణోత్సవానికి సంబంధించి శాశ్వత మండపాన్ని నిర్మించారు. అంతేకాకుండా మండపానికి అటు, ఇటువైపు ప్రత్యేక ఆకర్షణగా ఉండేలా నిర్మాణాలు చేపడుతున్నారు. చుట్టూ బారికేడ్లతోపాటు ఎక్కడికక్కడ గ్యాలరీలు, పున్నమి చంద్రుడు కనిపించేలా కల్యాణోత్సవ ఏర్పాట్లు చేస్తున్నారు. 40-50 వేల మంది భక్తులు కూర్చొని కల్యాణాన్ని తిలకించడంతోపాటు ఎల్‌ఈడీ స్క్రీన్ల ద్వారా స్వామి వారి కల్యాణాన్ని తిలకించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆలయం చుట్టు పక్కల చదును చేయడంతోపాటు వీఐపీలు, వీవీఐపీల రాక నేపథ్యంలో ఎలాంటి ఆటంకాలు కలగకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. పార్కింగ్‌తోపాటు ఇతర అన్ని పనులు వేగంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయ పరిసరాల్లో వెలుగులు నింపేందుకు అధికారులు పనులను వేగవంతం చేశారు. భక్తులకు అల్పాహారంతోపాటు రెండు పూటలా అన్నప్రసాద పంపిణీకి టీటీడీ అధికారులు చర్యలు చేపట్టారు. కల్యాణం రోజు భక్తులకు మజ్జిగ ప్యాకెట్లతోపాటు మంచినీటి ప్యాకెట్లు అందించనున్నారు.

నేడు అంకురార్పణ



టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, జేఈఓ వీరబ్రహ్మం నేతృత్వంలో ఒంటిమిట్ట కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమవుతోంది. మంగళవారం అంకురార్పణ జరుగుతుంది. బుధవారం ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించనున్నారు.
– నటేష్‌బాబు, డిప్యూటీ ఈఓ, ఒంటిమిట్ట దేవస్థానం

ఒకే శిలలో ముమ్మూర్తులు ప్రత్యేకం



ఒంటిమెట్ట మీద నిర్మించిన ఆలయం ఉన్న ప్రదేశం ఒంటిమిట్ట అయింది. ఒకే శిలలో సీతారామ లక్ష్మణ విగ్రహాలు నిర్మించబడ్డాయి. జాంబవంతుడు ముగ్గురిని ఒకే శిలలో భావించుకున్నాడు. బహుశా ఒకే శిలలో ముమ్మూర్తులను నిలిపిన సంఘటన ఒంటిమిట్టలోనే ఆవిష్కృతమైంది. – వీణా రాఘవాచార్యులు, ప్రధానఅర్చకులు, ఒంటిమిట్ట

రెండు రోజులు కవి సమ్మేళనం

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయంలో శ్రీరామ నవమి పర్వదినం, పోతన జయంతిని పురస్కరించుకుని టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ఏప్రిల్ 17, 18 తేదీలలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కవి సమ్మేళనం నిర్వహించనున్నారు.

17వ తేదీ

అంశం	రచయిత
భాగవతం, ప్రాశస్త్యం	శంకర్ ,
గజేంద్రుని ఆక్రందన	ఎం.నారాయణ రెడ్డి
మండోదరి హితబోధ	డాక్టర్ సుమన
సీతా స్వయంవరం	గోపాలకృష్ణ శాస్త్రి
రుక్మిణీ సందేశం	శివశంకర్
ఆలయ ప్రాశస్త్యం	శివారెడ్డి

18వ తేదీ

అంశం	రచయిత
రామాలయం ప్రాశస్త్యం	రాంప్రసాద్ రెడ్డి
హనుమత్ సందేశం	వెంకటరమణ
రంతి దేవుని చరిత్ర	నీలవేణి,
రామ లక్ష్మణుల సోదర ప్రేమ	వెంకటేశ్వర ఆచారి
శ్రీకృష్ణ లీల	మధుసూదన్
జానకి సందేశం	మల్లికార్జునరెడ్డి
రామరాజ్యం	నరసింహులు,
సుందరకాండ	జగన్నాథ్

పెద్ద శేషవాహనంపై రఘురాముడు



సర్వభూపాల వాహనంపై దర్శనమిస్తున్న శ్రీరామచంద్రుడు



పెద్దశేష వాహనంపై ఊరేగుతున్న శ్రీరాముడు

వాల్మీకిపురం : వాల్మీకి క్షేత్రంలోని శ్రీ పట్టాభిరామ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు సోమవారం రాత్రి 8గంటలకు స్వామివారు పెద్దశేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. వేకువ జామున సుప్రభాతసేవతో స్వామిని మేల్కొలిపి శుద్ధి, తోమాలసేవ, పంచాంగ శ్రవణం, కొలువు, అర్చన అనంతరం ఉదయం 8 నుంచి 9గంటల వరకు సర్వభూపాల వాహనంపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. వాహన సేవ అనంతరం 10 గంటల నుంచి స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. సాయంత్రం ఊంజల మండపంలో శాస్త్రోక్తంగా ఊంజల సేవ నిర్వహించారు. రాత్రి 8 గంటలకు పెద్దశేష వాహనసేవ కోలాహలంగా సాగింది. స్వామివారు పెద్దశేష వాహనాన్ని అధిరోహించి ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. మహిళలు పెద్దశేష వాహనంపై ఊరేగుతున్న స్వామివారికి నేతి దీపాలతో తిరుమాడ వీధుల్లో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి క్రిష్ణమూర్తి, సిబ్బంది నాగరాజ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 8గంటలకు సూర్యప్రభ వాహనం, 10గంటలకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 5గంటలకు ఊంజల సేవ, సాయంత్రం 6:30 గంటలకు చంద్ర ప్రభ వాహనసేవ, 8:30 గంటలకు పల్లకీలో మోహినీ అవతారోత్సవం ఉంటాయి.

పోలింగ్ ప్రక్రియలో

అధికారుల పాత్ర కీలకం

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్



మాట్లాడుతున్న కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్

రాయచోటి : సాధారణ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ ప్రక్రియలో పీఓ, ఏపీఓలు, సెక్టోరల్ అధికారుల పాత్ర ఎంతో కీలకమని, కేటాయించిన విధులపై పూర్తి అవగాహన ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ పేర్కొన్నారు. సోమవారం రాయచోటి డైట్ స్కూల్‌లో రాయచోటి శాసనసభ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ రంగస్వామి ఆధ్వర్యంలో రాయచోటి నియోజకవర్గం పీఓలు, ఏపీఓలు, సెక్టోరల్ అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమాన్ని కలెక్టర్ ఆస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో శిక్షణా కార్యక్రమాలు అత్యంత ముఖ్యమని, ఎన్నికల్లో పీఓలు, ఏపీఓల పాత్ర ఎంతో కీలకమన్నారు. శిక్షణలో అందించే ప్రతి అంశంపై పూర్తి స్పష్టతతో తెలుసుకొని ఉండాలన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే శిక్షణలో మాస్టర్ ట్రైనర్లను అడిగి సందేహ నివృత్తి చేసుకోవాలని తెలిపారు. సజావుగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా కేటాయించిన విధులను నిర్వర్తించాలన్నారు. రాయచోటి శాసనసభ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ రంగస్వామి మాట్లాడుతూ నియోజకవర్గానికి సంబంధించి పీఓలు, ఏపీఓలు, సెక్టోరల్ అధికారులకు ఎన్నికల విధులపై రెండు రోజులపాటు శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీఓలు, ఏపీఓలు, సెక్టోరల్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమ్మచేతి గోరుముద్దలా!

- పోషకాలను అందిస్తున్న జగనన్న గోరుముద్ద
- రోజుకో రకం వంటకాలతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం
- మూడు రోజులు రాగి జావ, ఐదు రోజులు కోడిగుడ్లు
- మెనూ ప్రకారమే వంటలు
- చిన్నారుల ఆరోగ్యానికి ప్రాధాన్యం

నాడు

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అంటేనే విద్యార్థులు అయిష్టంగా తినేవారు. అది మెనూ సక్రమంగా అమలు చేసేవారు కాదు. భోజనం నాసికరంగా ఉండటంతో చాలా మంది విద్యార్థులు ఇంటి నుంచి క్యారియర్ తెచ్చుకుని తినేవారు. పథకం సరిగా అమలు కాక విద్యార్థులకు సరైన ఆహారం అందేది కాదు.

నేడు

నేడు విద్యార్థులు మధ్యాహ్న భోజనం ఇష్టంగా తింటున్నారు. వారానికి ఐదు సార్లు కోడిగుడ్లతో పాటు రుచికరమైన వంటలు వండటంతో విద్యార్థులు సంబరపడిపోతున్నారు. పోషకాహారాలతో నూతన మెనూ అమలు చేస్తున్నారు. అలాగే రాగిజావ అందిస్తున్నారు.

మండలాలు	30
1 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు	1,44,467
గోరుముద్ద అమలవుతున్న పాఠశాలలు	2190

జగనన్న గోరు ముద్ద మెనూ

సోమవారం	హాట్ పొంగల్, ఉడికించిన గుడ్డు, వెజిటబుల్ పలావ్, కోడిగుడ్డు కూర, చిక్కీ
మంగళవారం	పులిహోరా, టమాటా పచ్చడి, దొండకాయ పచ్చడి, ఉడికించిన గుడ్డు, రాగిజావ
బుధవారం	వెజిటబుల్ బిర్యానీ, ఆలూ కుర్మా, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కీ
గురువారం	నిమ్మకాయ పులిహోరా, టమాటా చెట్నీ, ఉడికించిన గుడ్డు, రాగిజావ
శుక్రవారం	అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కీ
శనివారం	ఆకుకూర అన్నం, పప్పు చారు, తీపి పొంగలి, రాగిజావ





ఇది కదా.. అభివృద్ధి

మదనపల్లె సిటీ : డ్రాపౌట్ల నివారణతో పాటు, విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తోంది. ప్రజాసంకల్ప పాదయాత్రలో వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థుల ఆకలి గమనించారు. గత ఎన్నికల్లో అఖండ విజయం సాధించడంతో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించగానే.. వారికి నాణ్యమైన పౌష్టికాహారం అందించేలా చర్యలు తీసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకంలో గతంలో ఎన్నడూ చూడని మార్పులు చేశారు. జగనన్న గోరుముద్ద పేరిట విద్యార్థుల ఎదుగుదలకు అవసరమైన పోషకాహారంతో నూతన మెనూ రూపొందించి, పక్కాగా అమలు చేస్తున్నారు. రోజుకో వంటకంతో నాణ్యమైన భోజనం అందిస్తున్నారు. ప్రభుత్వ చర్యలతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

పారదర్శకత... పర్యవేక్షణ

జగనన్న గోరుముద్ద అమలు బాధ్యతను పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అప్పగించారు. వీరితో పాటు పేరెంట్స్ కమిటీ సభ్యులు, సచివాలయ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్, గ్రామ కమిటీ ప్రతినిధులు కూడా ప్రతి రోజూ ఆహార పదార్థాల నాణ్యతను పర్యవేక్షిస్తున్నారు. ఆ తరువాతే విద్యార్థులకు ఆహార పదార్థాలు వడ్డిస్తున్నారు. ఎంఈఓలు కూడా రోజూ తమ పరిధిలోని ఒక పాఠశాలలను సందర్శించి, నాణ్యతను పరిశీలిస్తున్నారు. తద్వారా ఈ పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తున్నారు.

కడుపు నిండా తింటున్నాం



పాఠశాలలో మధ్యాహ్న భోజనం చాలా బాగుంది. గతంలో కంటే ఇప్పుడు ప్రతి రోజూ ముందుగా నిర్ణయించిన మెనూ ప్రకారం ఆహార పదార్థాలు వండి పెడుతున్నారు. మా స్కూల్లో అందరం కడుపు నిండా ఈ భోజనాన్నే తింటున్నాం. రోజూ అన్నం, గుడ్లు, చిక్కీ ఇస్తున్నారు. దీంతో సాయంత్రం ఇంటికి వెళ్లే వరకూ ఆకలి తెలియడం లేదు.
– సహానా, 7వ తరగతి, మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాల, చంద్రకాలనీ, మదనపల్లె.

రుచిగా వండుతున్నారు



నేను రోజూ మధ్యాహ్నం స్కూల్లో జగనన్న గోరు ముద్ద తింటున్నాను. వారానికి ఐదు రోజులు కోడిగుడ్లు ఇస్తున్నారు. రోజుకో వెరైటీ కూరతో భోజనం పెడుతున్నారు. ఇప్పుడు ఇంటి దగ్గర కంటే బడిలోనే రుచిగా ఉంటోంది. చదువుకోవడానికి, తినడానికి ఎలాంటి ఇబ్బందులూ లేవు. మా అమ్మా, నాన్నలు కూడా సంతోషంగా బడికి పంపుతున్నారు. – శృతి, 8వ తరగతి, జెడ్పీహెచ్‌ఎస్, మదనపల్లె.

వైఎస్సార్‌సీపీలోకి వలసల వెల్లువ



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, తిరుపాల్‌రెడ్డి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వలసలు జోరందుకున్నాయి. సోమవారం ఆయా నియోజకవర్గాల్లో వేలాది కుటుంబాలు వైఎస్‌ఆర్ సీపీలో చేరాయి. వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని ఆ పార్టీలో చేరిన వారు ఉత్సాహంగా అన్నారు.

కడప నగరంలోని స్థానిక 7వ డివిజన్‌లో తెలుగుదేశం పార్టీకి చెందిన 50 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి డిప్యూటీ సీఎం అంజద్‌బాషా కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన షేక్ అబ్దుల్, అలీ, జహీర్, ఇలియాస్, క్రిష్ణతేజ, ఇస్మాయిల్, కార్తీక్, శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ టీడీపీ అభ్యర్థి మాధవీ తమకు బలవంతంగా కండువాలు వేసి ఫొటోలు తీసుకున్నారని, ఇప్పుడు తాము స్వచ్ఛందంగా వైఎస్సార్‌సీపీలో చేరామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పి. జయచంద్రారెడ్డి, తోటక్రిష్ణ, రాణాప్రతాప్, కె.కొండయ్య, రామ్మోహన్‌రెడ్డి, సమరనాథ రెడ్డి, గంగరాజు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి 30 విశ్వబ్రాహ్మణ కుటుంబాలు..

మైదుకూరు: మైదుకూరు పట్టణంలోని 22వ వార్డులో సోమవారం టీడీపీ నుంచి 30 విశ్వబ్రాహ్మణ కుటుంబాల వారు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వార్డుకు చెందిన టీడీపీ పార్లమెంటరీ విశ్వబ్రాహ్మణ విభాగం ఆర్గనైజర్ చిన్నదండ్లూరు విశ్వనాథ ఆచారితో పాటు చిన్నదండ్లూరు రామమోహన్ ఆచారి, పేర్నపాటి రాఘవాచారి, వీరకుమారి, శ్రీకాంత్ ఆచారి, ప్రతాప్ ఆచారి, రమణాచారి, చిన్న అమ్మణ్ణి, పెద్ద అమ్మణ్ణి, రాజా ఆచారి, వసుంధర, సుబ్రహ్మణ్యం ఆచారి, సింగా వీరేశ్వర ఆచారి (దువ్వూరు), శ్రీను ఆచారి (గుడిపాడు), అనిల్ కుమార్ రెడ్డి, ఓం నాథ్ రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, విష్ణువర్ధన్ ఆచారి, ప్రమీల దేవి, చంద్రకళ, మహమూద్ తదితర కుటుంబాల వారు పార్టీలో చేరారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ప్రభుత్వ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గొడ్లవీటి సుబ్రహ్మణ్యం ఆచారి, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ మదీనా దస్తగిరి పాల్గొన్నారు.

40కుటుంబాలు చేరిక

వీరపునాయునిపల్లె : మండలంలోని యు.వెంకటాపురంలో తెలుగుదేశం పార్టీకి చెందిన రమణ, బాబు, గంగాధర, గోపాల్, క్రిష్ణయ్య, ఆంజనేయులు, జయమ్మ, గంగరాజు, గుర్రప్ప, అంజనేయులు, బాబు, భాస్కర్, రాజా, వినోద్, పుల్లయ్య, గంగయ్య, రెడ్డెయ్య, పుల్లయ్య, గణేష్, గంగులు, వెంకటరమణ, పెద్ద కొండయ్య, రామాంజనేయులు, రామాంజనేయులు, పెద్ద ఆంజనేయులు, బాలవీరయ్య వీరితో పాటు మరో 10కుటుంబాలు సోమవారం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి వీరందరికీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. జేసీసీ కన్వీనర్ మహేంద్రారెడ్డి, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, గడ్డంవారిపల్లె సహకార సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం : బి.మఠం మండలంలోని డి.నేలటూరు, రేకలకుంట పంచాయతీల నుంచి టీడీపీకి చెందిన 400 కుటుంబాలు మైదుకూరు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో సోమవారం చేరాయి. వీరిలో డి.నేలటూరు పంచాయతీ మాజీ ఎంపీటీసీ వివేకానందరెడ్డితో పాటు ఆయన సోదరులు, భట్రాజుల సంఘం నాయకుడు బంగారు రాజు , మాజీ విలేకరి రామయ్య, కుటుంబ సభ్యులు.. రేకులకుంట పంచాయతీ బాగాదిపల్లె,గొల్లపల్లెకు చెందిన పలు కుటుంబాలు రాజా నాయుడు, మాజీ సర్పంచ్ వెంకటయ్యల సహకారంతో పలుకుటుంబాలవారు పార్టీలో చేరారు.

ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సమక్షంలో..

గాలివీడు : మండలంలోని ఎగువగొట్టివీడు, గోరాన్‌చెరువు గ్రామాలలో పలువురు తెలుగుదేశం పార్టీని వీడి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో ఎగువగొట్టివీడు గ్రామం నాగన్న గుట్టపాలెంకు చెందిన చలపతి నాయుడు, ఆయన కుమారులు నారే చంద్రబాబు నాయుడు, గోరాన్‌చెరువు గ్రామం పెద్దపల్లెకు చెందిన అక్కులగారి గోపాల్‌రెడ్డి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉప సర్పంచ్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని టి.సదుం పంచాయతీ ఉప సర్పంచ్ పీఎస్ మధు ఆధ్వర్యంలో సోమవారం టీడీపీకి చెందిన వారు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. పంచాయతీలోని పలు గ్రామాలకు చెందిన నరసింహులు, అంజి,శ్రీరాములు, రమేష్, నారాయణప్ప, నరసిహులు, గంగాధర్, నారాయణస్వామి, క్రిష్ణప్ప, సూరి, నాగరాజు, రామక్రిష్ణ,వెంకట్రమణ, ఆదెప్ప, అంజి, గౌరమ్మ, ఓబులమ్మ, నరసప్ప, శ్రీనివాసులు,ఆంజినేయప్ప, నీరుగట్టి యేసు, గుంటిపల్లి నరేంద్ర, తేజ, అనిల్,రాము, మోహన్, నాగరాజు, శంకరన్న, వెంకటప్ప, శంకరప్ప, చిన్నోడు, వేమనారాయణ,రవి, వెంకటేష్, నాగరాజు, కోణప్ప, మంజు,శ్రీనాథ్ తదితరులు పార్టీలోకి చేరారు.



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారితో పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి



డి.నేలటూరు పంచాయతీ మాజీ ఎంపీటీసీ వివేకానందరెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, సాయినాథశర్మ

బీజేపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరిక

ప్రొద్దుటూరు : రాజుపాళెం మండలంలోని టంగుటూరు గ్రామానికి చెందిన బీజేపీ నాయకుల కుటుంబాలు ప్రొద్దుటూరులో సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గౌతమ్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముస్లిం దూదేకుల కుటుంబాలకు చెందిన కందుకూరి వెంకటసుబ్బన్న, కందుకూరి సుబ్బారావు, రామసుబ్బన్న, నాగరాజు, నాగదస్తగిరి, అచ్చుకట్ల జమాల్ పీర్, చార్లీన్, సతీష్, రూథర్, ఫక్ర్‌ద్దీన్ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి..

కమలాపురం : మండల పరిధిలోని కొండాయపల్లె గ్రామానికి చెందిన 75 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. సోమవారం రాత్రి ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు సాయినాథశర్మ ఆధ్వర్యంలో టీడీపీని వీడి వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. సర్పంచ్ పల్లేటి భవాని, ఎంపీటీసీ నాగరాజాచారి, గుండం వెంకటేశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, నవనీశ్వర్‌రెడ్డి, ప్రసాద్, సుధాకర్, సుదర్శన్, నాగేశ్వరరావు, గంగాధర్, రఘురాం, సుమన్, కొండయ్య, రాయప్ప తదితర 75 కుటుంబాల వారికి ఎమ్మెల్యే రవిరెడ్డి, సాయినాథ శర్మ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. దీంతో కొండాయపల్లె, హరిజనవాడలో నాలుగు కుటుంబాలు మినహా గ్రామంలోని కుటుంబాలన్నీ వైఎస్సార్ సీపీలో చేరినట్లు అయింది. కార్యక్రమంలో సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్ రెడ్డి, మారుజోళ్ల శ్రీనివాస రెడ్డి, ప్రసాద్ తదితరులు మాట్లాడారు. మైసూరా రెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, కొండారెడ్డి, చెన్నకేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవశకం



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్తోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

ఆసరాగా నిలిచిన ప్రభుత్వం



మాది మైదుకూరు మండలం తువ్వపల్లె గ్రామం. కొంత భూమి ఉంది. మాకు ఇద్దరు పిల్లలు. పెద్దకుమారుడు కార్తీక్ హైస్కూల్‌లో ఉన్నప్పుడు, ఇంటర్, డిగ్రీ చదివే సమయంలో అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన కింద ఆర్థిక సాయం అందింది. అంతేగాక నాకు ఆరోగ్యం సరిగా లేక ఆస్పత్రికి వెళితే ఆరోగ్యశ్రీ కింద రూ.30వేలు మంజూరైంది. నాకు వైఎస్సార్ ఆసరా, ఉన్నా వడ్డీ, నా భర్త గంగస్వామికి రైతు భరోసా పథకాల కింద ఆర్థిక సాయం అందింది. ఇల్లు లేని మాకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి స్థలం, పక్కా ఇల్లు మంజూరు చేశారు. ఆయన మేలు మరిచిపోం. ఇన్ని పథకాలతో మా కుటుంబానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆసరాగా నిలిచింది.

- సింగి బాలక్క, తువ్వపల్లె, మైదుకూరు మండలం

సులభంగా ధ్రువపత్రాలు..



గతంలో మా పిల్లలకోసం ఏవైనా ధ్రువీకరణపత్రాలు పొందాలంటే మీ సేవలో దరఖాస్తు చేసుకుని అనంతరం పత్రాలు చేతికందాలంటే మీసేవ, తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. జగనన్న సురక్ష కార్యక్రమంలో మాకు అవసరమైన సర్టిఫికెట్ల కోసం గ్రామ వలంటీర్ సహాయంతో ఒక్కరోజులోనే మా ఇంటి వద్దకు తెచ్చి ఇచ్చారు. పథకాలు, పత్రాల కోసం అన్ని విధాలుగా సులభం చేసిన సీఎం జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటాం.

- ఎస్. సీరాబాను, పీలేరు

హమాలీ ఆత్మహత్య



క్రిష్ణయ్య(ఫైల్)

మదనపల్లె సిటీ: టమాటా మండీలో పని చేసే హమాలీ సోమవారం మార్కెట్ సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వాల్మీకిపురం మండలం నగిరిమడుగుకు చెందిన సి.క్రిష్ణయ్య (53) స్థానిక మార్కెట్ యార్డులోని ఓ మండీలో హమాలీగా పని చేస్తున్నాడు. మదనపల్లె పట్టణం గజ్జలకుంటలో నివాసముంటున్న ఇతనికి భార్య లక్ష్మీదేవి, కుమారులు రాజశేఖర్, అశోక్‌కుమార్ ఉన్నారు. సంఘటనా స్థలానికి సీఐ యువరాజ్, ఎస్‌ఐలు పరిశీలించారు. భర్త మృతి పట్ల తనకు పలు అనుమానాలు ఉన్నాయని భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కారు కొనడానికి వస్తే ...కత్తితో పొడిచాడు

మదనపల్లె సిటీ : కారు కొనడానికి వచ్చిన కస్టమర్‌పై కత్తితో దాడి చేసిన ఘటన మదనపల్లెలో సోమవారం జరిగింది. రాయచోటి మండలం వీరబల్లికి చెందిన శ్రీనివాసులునాయుడు (32) కారు కొనుగోలు చేసేందుకు వలసపల్లె నవోదయ కాలనీలో సెకండ్ హ్యాండ్ కార్లు అమ్మే షాపుకు వచ్చాడు. ఓ కారును రూ.4 లక్షలకు బేరం కుదుర్చుకుని రూ.1.30 లక్షలు అడ్వాన్స్ ఇచ్చి ట్రయిల్‌కు వెళ్లాడు. కారు నచ్చలేదని డబ్బులు వాపస్ ఇవ్వాలని కార్లు అమ్మే యజమాని మల్లిని కోరాడు. దీంతో ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. ఈ దాడిలో మల్లి కత్తితో చెంపపై పొడిచాడు. తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులునాయుడు స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాత కక్షతో..

మదనపల్లె సిటీ : పాతకక్షలతో ఓ వ్యక్తిపై దాడి చేసిన సంఘటన మదనపల్లె పట్టణం చంద్రాకాలనీలో సోమవారం జరిగింది. చంద్రకాలనీకి చెందిన శ్రీకాంత్ (27)కు ఇదే ప్రాంతానికి చెందిన రాజేష్‌కు పాత గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో శ్రీకాంత్ ఇంటికి వెళుతుండగా రాజేష్ అతని స్నేహితులు కలిసి కర్రతో దాడి చేసి గాయపరిచారు. గాయపడిన శ్రీకాంత్ స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య



కుమార్తె మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి

రాజంపేట: రాజంపేటలోని ఏఐటీఎస్ ఇంజినీరింగ్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థిని రేణుకా మహంక్(20) సోమవారం ఆత్మహత్య చేసుకుంది. సమాచారం తెలుసుకుని నంద్యాల నుంచి వచ్చిన తల్లిదండ్రులు ప్రసాదరావు, భాగ్యలక్ష్మి కన్నీటిపర్యంతమయ్యారు. ఈ విషయంపై సీఐ రవీంద్రనాథ్ మాట్లాడుతూ విద్యార్థిని ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నామన్నారు.

గొర్రెల కాపరిపై అత్యాచారయత్నం

చిన్నమండెం : చిన్నమండెం మండల పరిధిలో గొర్రెల కాపరిపై టీడీపీ కార్యకర్తలు అత్యాచారయత్నం చేసినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. మండల పరిధిలోని కొత్తపల్లె పంచాయతీ శ్రీనివాసపురానికి చెందిన రాపూరి చిట్టెమ్మ గొర్రెలను సమీప బీడు ప్రాంతంలో మేపుతుండగా, అటువైపుగా వెళ్తున్న టీడీపీకి చెందిన ఈర్ల క్రిష్ణయ్య, మరో ముగ్గురు ఆమెపై అత్యాచారానికి యత్నించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ



ఘర్షణలో గాయపడి చికిత్స పొందుతున్న మహిళ

ఓబులవారిపల్లె : మండలంలోని చిన్నఓరంపాడు గ్రామంలో పాత కక్షల కారణంగా సోమవారం రాత్రి గొడవలు జరిగాయి. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన నరసింహులు, శంకరయ్య ఇంటి స్థలానికి సంబంధించి రెండేళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. ఏడాది క్రితం పోలీసులు కల్పించుకొని ఇరువర్గాలను రాజీ చేసి వివాద స్థలంలో హద్దులు ఏర్పాటు చేశారు. ఇటీవల గల్ఫ్ దేశం నుంచి వచ్చిన నాగరాజు సోమవారం హద్దుల నిమిత్తం నాటిన బండలను పగులకొట్టడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ మొదలైంది. ఈ ఘర్షణలో పలువురికి రక్త గాయాలయ్యాయి. శంకరయ్య, నాగయ్య, శివయ్య, జ్యోతి, రత్న, నరసింహులు, లక్ష్మీదేవి, చెంగమ్మ, నాగేశ్వరీ, బాలాజీ, మణెమ్మలకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. ఏపీ టీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని క్షతగాత్రులను పరామర్శించి గొడవకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

మనస్థాపంతోనే సురేఖ ఆత్మహత్య



సురేఖ మృతదేహం

వేంపల్లె : పరీక్షలు సరిగా రాయలేదన్న మనస్థాపంతోనే ట్రిపుల్ ఐటీ విద్యార్థిని సురేఖ (21) ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటీలో ఇంజనీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతున్న సురేఖ ఆదివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. సోమవారం కడప రిమ్స్‌లో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి మృతికి గల కారణాలపై విచారణ చేస్తున్నారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రకాశంజిల్లా జంగంగుంట్ల గ్రామానికి చెందిన మాజీ మిలిటరీ అధికారి పుల్లయ్య, కోటేశ్వరి దంపతుల కుమార్తె సురేఖ ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటీలో ఇంజనీరింగ్ నాలుగవ సంవత్సరం చదువుతోంది. ఈ నేపథ్యంలో సోమవారం సెమిస్టర్‌-2 చివరి పరీక్షతో పూర్తయి వారం రోజుల్లో తమ గ్రామానికి వెళ్లాల్సి ఉంది. ఈ క్రమంలో సురేఖ ఆదివారం సాయంత్రం హాస్టల్ గది నుంచి తల్లిదండ్రులకు ఫోన్ చేసి 'పరీక్షలు సరిగా రాయలేదని, నేను చనిపోతున్నానని' తల్లిదండ్రులకు ఫోన్‌చేసి చెప్పారని తెలిపారు. తల్లిదండ్రులు హాస్టల్ గదికి సంబంధించి కేర్‌టేకర్‌కు ఫోన్ చేయగా కేర్‌టేకర్ అలర్ట్ అయ్యేలోపు హాస్టల్ గది రెండవ అంతస్తు నుంచి బయటికి దూకింది. తోటివిద్యార్థులు గమనించి ట్రిపుల్‌ఐటీ అధికారులకు సమాచారం ఇచ్చారన్నారు. హుటాహుటిన అక్కడే ఉన్న ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 10గంటల సమయంలో సురేఖ మృతిచెందింది. అయితే పరీక్షలు సరిగా రాయకుంటే ఇలాంటి అఘాయిత్యానికి పాల్పడుతుందా లేక ఇతరత్రా సమస్యలు ఏమైనా ఉన్నాయా అని పలువురు విద్యార్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా పోలీసుల విచారణలో పూర్తి వివరాలు తెలిసే అవకాశం ఉంది.

రాష్ట్రంలో తెలుగు నాటకానికి కొత్త వెలుగు

- నేడు తెలుగు నాటక రంగ దినోత్సవం
- కందుకూరి వీరేశలింగం జయంతి

కడప కల్చరల్ : తెలుగు నాటకరంగ వైతాళికుడు, సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని మంగళవారం తెలుగునాట ఘనంగా నిర్వహించనున్నారు. పెద్దయ్యగారిపెళ్లి, ప్లీడర్ నాటకం తదితర నాటకాలతో తెలుగునాటకానికి రహదారి పరిచిన ఆయన మనకు తెలుగులో అందించిన నాటకాలు ఆ రంగానికి కొత్తబాట చూపాయి. అందుకే ఆయనను తెలుగు నాటకరంగ వైతాళికుడిగా భావిస్తారు. మంగళవారం ఆయన జయంతిని తెలుగు నాటకరంగ దినోత్సవంగా రాష్ట్రమంతటా నిర్వహిస్తున్నారు. నిజానికి తెలుగునాట మిగతా కవుల వలెనే కందుకూరి వీరేశలింగంకు కూడా సాధారణ స్థాయితో సరిపెట్టారు. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా వచ్చిన వెంటనే ఆ మహానుభావుడి జయంతిని తెలుగు నాటక రంగ దినోత్సవంగా ప్రకటించి యేటా ఆయన జయంతి నాడు ఐదుగురు సీనియర్ రంగస్థల నటులను సత్కరించే సత్సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. పెద్దలైన నాటకరంగ కళాకారులు ఎంతో సంతోషించారు. ఆ తర్వాత వచ్చిన, ఆ రంగంపై ఏమాత్రం పరిచయం, గౌరవం లేని ప్రభుత్వాలు నాటక దినోత్సవానికి తెరదించాయి. డాక్టర్ వైఎస్సార్ తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా వచ్చాక మళ్లీ ఈ దినోత్సవాన్ని పునరుద్ధరించారు. తెలుగు నాటకానికి పూర్వ వైభవం కల్పించేలా ఈ రంగానికి కొత్త హంగులు దిద్దారు. మొత్తం 73 విభాగాలలో బహుమతులను ఏర్పాటు చేసి ఒక్కొక్క బహుమతికి గరిష్ఠంగా రూ. లక్ష, కనిష్ఠంగా రూ. 50 వేల పారితోషికాలతో తెలుగు నాటకరంగానికి కొత్త కళ కనిపించారు. రంగస్థల కళాకారుల్లో ఎనలేని సంతోషాన్ని నింపారు. ఆర్థికంగా పెద్ద బహుమతులు గనుక ఇవి వారిలో నాటకరంగంపై అభిమానం కొనసాగించేందుకు ఎంతో ఉపయోగపడ్డాయి. దీంతో ఈ రంగానికి కొత్త జీవం లభించినట్లయింది.

సురభి స్ఫూర్తి.. సవేరా కీర్తి

ప్రపంచ నాటకరంగంచే శభాష్ అనిపించుకున్న సంస్థ సురభి. వైఎస్సార్ జిల్లాలోని సురభి గ్రామంలో తోలుబొమ్మలాట నుంచి రంగస్థల నాటకంగా మార్పు చెంది నాటకాన్ని ఆదరించే ప్రముఖ దేశాల నుంచి ప్రశంసలందుకున్న ఈ సంస్థ స్ఫూర్తితో జిల్లాకు చెందిన సవేరా ఆర్ట్స్ థియేటర్ ఈ రంగంలో ఇతరులెవ్వరూ చేయని కృషి చేసింది. 27 నంది బహుమతులను సాధించి జిల్లా కీర్తిని దక్షిణ ప్రాంత నాటక ప్రపంచానికి తెలియజేసింది. సంస్థ నిర్వాహకులు ఆళ్లూరి వెంకటయ్య దర్శక నిర్వాహకునిగా మొత్తం రామాయణాన్ని నాలుగు భాగాలుగా రచయిత పల్లేటి లక్ష్మీకులశేఖర్‌తో రాయించి దక్షిణ రాష్ట్రాలన్నిటా విజయవంతంగా ప్రదర్శించి గొప్ప కీర్తిని సాధించారు. సురభి నాటకం తర్వాత ఈ జిల్లా నుంచి ఆ స్థాయి ప్రాచుర్యం, కీర్తిని సవేరా నాటక సంస్థ సాధించిందని నాటకలోకం కీర్తిస్తోంది. ఒకప్పుడు జిల్లాలో యంగ్‌మెన్స్ డ్రమెటిక్ అసోసియేషన్ (వైఎండీఏ) అత్యంత క్రమశిక్షణగల సంస్థగా విజయవంతంగా ప్రదర్శనలిచ్చిన సంస్థగా పేరుగాంచింది. ఆ తర్వాత ప్రస్తుతం సవేరా సంస్థ కూడా అత్యంత క్రమశిక్షణతో ఏ విభాగంలోనూ, ఎలాంటి లోపం లేకుండా సినిమా చూసిన అనుభూతిని కల్పిస్తూ తెలుగు నాటక వైభవాన్ని నలుదిశలా చాటింది. సవేరా సంస్థతోపాటు జిల్లాలో ప్రొద్దుటూరు, రాజంపేట, నందలూరు, బద్వేలు తదితర ప్రాంతాల్లో కూడా తెలుగు నాటకం వైభవాన్ని చాటుతూనే ఉంది.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

మదనపల్లె సిటీ : కురబలకోట మండలం తాజ్ పాఠశాల వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి మృతి చెందగా, మరో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే.. కొత్తపల్లికి చెందిన విద్యార్థి మహేశ్వర్‌రెడ్డి(21)తో పాటు వేణుమాధవ్(20)లు ఇద్దరు కలిసి ద్విచక్ర వాహనంలో మినరల్ వాటర్ తీసుకురావడానికి వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తుండగా మార్గం మధ్యలో బైకు అదుపుతప్పి చెట్టుకు ఢీకొన్నారు. ప్రమాదంలో మహేశ్వర్‌రెడ్డి, వేణుమాధవ్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 వాహనం ద్వారా మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. మహేశ్వర్‌రెడ్డి మృతి చెందగా వేణుగోపాల్ చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ ప్రమాదంలో..



మృతి చెందిన శ్రీకాంత్ రెడ్డి

చక్రాయపేట : మండలంలోని కల్లూరుపల్లె గ్రామం కాట్లగంటివారిపల్లెకు చెందిన శ్రీకాంత్‌రెడ్డి (15) అనే విద్యార్థి ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి మృతి చెందాడు.ఈ సంఘటన సోమవారం ఉదయం జరిగింది.ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాంత్ తెల్లవారుజామున గడ్డి కోసం ట్రాక్టర్‌లో బయలు దేరాడు.మలుపు వద్ద ట్రాక్టర్ కు పెట్టిన నాటుకట్టె విరిగి పోయింది. ఆ కట్టెను పట్టుకొని ఉన్న శ్రీకాంత్ ఒక్కసారిగా రాయిపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహానికి శవపరీక్షలు నిర్వహించినట్లు ఎస్ఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

తంబళ్లపల్లె : తంబళ్లపల్లె మండల పరిధిలో ఓ వివాహిత చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తంబళ్లపల్లె పోలీసుల కథనం మేరకు..కురబలకోట మండలం గొడ్డిండ్లవారిపల్లెకి చెందిన మంజునాథ తన భార్య సుజాతతో గొడవ పడ్డాడు. మనస్తాపం చెందిన ఆమె పరిసర ప్రాంతమైన తంబళ్లపల్లె మండలం కుక్కరాజుపల్లె దగ్గర కుమ్మరపల్లె వద్ద వ్యవసాయ పొలాల్లో ఉరివేసుకుంది. సోమవారం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు కేసు నమోదు చేసి పోస్టుమార్టం కోసం మృత దేహాన్ని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. కట్నం కోసం వేధించడంతో తన చెల్లెలు సుజాత ఆత్మహత్యకు పాల్పడిందని ఆమె సోదరుడు ఫిర్యాదు చేశాడని పోలీసులు తెలిపారు.

సీఎం ఆరోగ్యంగా ఉండాలని పూజలు



సౌమ్యనాథుడి సన్నిధిలో ఉత్తరఅమెరికా ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి పండుగాయల రత్నాకర్

రాజంపేట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిండునూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని, స్వామివారి ఆశీస్సులు ఆయనకు మెండుగా ఉండాలంటూ ఉత్తర అమెరికా ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి పండుగాయల రత్నాకర్ నందలూరు సౌమ్యనాథాలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. సోమవారం ఆయన సౌమ్యనాథాలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌పై దాడి చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు, నేతలు ఈ దాడిని ఖండిస్తుంటే, ఒక చంద్రబాబు, లోకేష్‌లు దాడిపై నీతిలేని మాటలు మాట్లాడం ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. అంతకుముందు సౌమ్యనాథాలయం మాజీ చైర్మన్ అరిగెల సౌమిత్రి, అరిగె సోదరులు అరిగె హరిబాబు, అరిగె మణి ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఆయన వెంట రాజంపేట మున్సిపాలిటి వైస్‌చైర్మన్ మర్రి రవి, కౌన్సిలర్ నవీన్, స్థానిక నాయకులు సుబ్బరామయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.